సాక్షి
అన్నమయ్య జిల్లా
గురువారం । 17 । జూలై । 2025



నకిలీ పత్రాలతో నిరుద్యోగులకు వల

నకిలీ కంపెనీలు చూపి ఉద్యోగాలిస్తామంటూ నిరుద్యోగ యువతకు మోసగాళ్లు వల వేస్తున్నారని, అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు సూచించారు. -8లో



హత్యత్యాయత్నం కేసులో జైలు శిక్ష

ప్రభుత్వ ఉద్యోగిపై హత్యాయత్నం, ప్రభుత్వ ఆస్తిని నష్టం కలిగించిన కేసులో రాజోలి మల్లికార్జున, ఆయన తల్లి రాజోలి రత్నమ్మలకు రెండున్నరేళ్ల జైలు శిక్ష విధించారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.280	రూ.340
రెండోరకం	రూ.180	రూ.270

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 902 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

అదనపు చార్జీలు వసూలు చేస్తున్నారని ఫిర్యాదు

రాజంపేట: రాజంపేట ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో పాసు జారీ కౌంటర్‌లో అదనపు చార్జీలు వసూలు చేస్తున్నారని విద్యార్థులు ఆరోపించారు. బుధవారం కలెక్టర్‌కు వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేశారు. బస్ పాసు రెన్యూవల్ చేయ డంలో కూడా నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారన్నారు. రెండు నుంచి మూడురోజుల పాటు వివిధ కారణాలతో బస్సు పాసులు ఇవ్వకుండా విద్యార్థులను తిప్పుకుంటు న్నారన్నారు. ఇదే విషయంపై డిపో మేనేజరు రమణయ్యకు అనేక మార్లు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యమన్నారు. ఈ విషయంపై అధికారులతో విచారణ చేయించాలన్నారు. బస్సు పాసులపై అదనపు చార్జీలు వసూలు చేయకుండా కట్టడి చేయాలని కలెక్టర్‌కు విన్నవించారు. కలెక్టర్‌కూడా సానుకూలంగా స్పందించనట్లు వాట్సాప్ ద్వారా సమాచారం ఇచ్చారు.

యువతకు ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డి సర్కిల్: వైఎస్‌ఆర్ జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులలో మూడు నెలలపాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్ కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9392348430 అనే ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్: కడపలోని ప్రభుత్వ పురుషుల కళాశాల (ఆర్ట్స్ కళాశాల)లో పొలిటికల్ సైన్స్, హిస్టరీ, ఎకనామిక్స్, జియాలజీ,కంప్యూటర్ సైన్సు/అప్లికేషన్ సబ్జెక్టులకు అతిథి అధ్యాపక ఉద్యోగాలకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జి.రవీంద్రనాథ్ తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు జూలై 18 వ తేదీ కళాశాలలో ఉదయం 10.30 గంటలకు ప్రిన్సిపాల్ గారి కార్యాలయంలో హాజరు కావాలని సూచించారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో మాస్టర్స్ డిగ్రీ కలిగి ఉండాలని తెలిపారు. నెట్, స్లెట్ , పి.హెచ్ డి అర్హతలు కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందని అన్నారు.

ఎలైట్‌క్రూప్స్ డేటా పేరుతో
ఘరానా మోసం

- ఒకటి రెండ్లు రాస్తే డబ్బులట..!!
- మహిళలను మోసగించి రూ. 2 కోట్ల వంచన
- పోలీసులను ఆశ్రయించిన వందలాది మంది బాధితులు
- అంగళ్లులో ధర్నా, రాస్తారోకో



అంగళ్లు ఓపీ స్టేషన్ ఎదుట న్యాయం కోసం వందల మంది బాధిత మహిళల నిరసన

కురబలకోట: డేటా ఎంట్రీ ఫారంలో ఒకటి రెండ్లు సంఖ్యలు రాస్తే డబ్బులిస్తామని నమ్మబలికి మహిళలకు రూ. 2 కోట్లకు పైగా మోసగించిన సంఘటన కురబలకోట మండలంలోని అంగళ్లులో బుధవారం వెలుగు చూసింది. జిల్లాలోని వివిధ మండలాల్లో కలకలాన్ని సృష్టించింది. బాధితులు, రూరల్ సీఐ సత్యనారాయణ కథనం మేరకు...అంగళ్లు కదిరి రోడ్డులో మూడు నెలల కిందట ఎలైట్ క్రూప్స్ డేటా సొల్యూషన్స్ పేరుతో బెంగళూరుకు చెందిన వినోద్‌కుమార్ అద్దె భవనంలో ఓ కార్యాలయం ఏర్పాటు చేశారు. అంగళ్లు గ్రామానికి చెందిన ఆరుగురు మహిళలు, ఇద్దరు పురుషులను తాత్కాలిక ఉద్యోగులుగా నియమించారు. వీరికి రోజుకు రూ. 350 చొప్పున ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నాడు. వీరు పార్ట్ టైమ్ కింద డేటా ఎంట్రీకి వచ్చే మహిళలను రిజిస్ట్రేషన్ చేయడం, డబ్బులు వసూలు చేయడం లాంటి పనులు చేసేవారు. డేటా ఫారాలపై వారు చెప్పిన సంఖ్యల్లో ఒకటి రెండ్లు రాయాలి. మహిళలు తొలుత రూ. మూడు వేల చొప్పున చెల్లిస్తే వారికి వంద డేటా ఫారాలు ఇస్తారు. రాయాల్సిన సంఖ్యలను చెబుతారు. వీటిని ఎలాంటి తప్పులు,దిద్దుబాట్లు లేకుండా రాస్తే రూ. ఐదు వేలు ఇస్తారు. వంద మంది డేటా ఫారాలు తీసుకుంటే వీరిలో ఏ కొద్దిమందికో డబ్బులు ఇచ్చి మిగిలిన వారికి డబ్బులు ఇవ్వకుండా తప్పులున్నాయనో..కొట్టివేతలు ఉన్నాయన్న సాకుతో వెనక్కి పంపేవారు. మూడు వేలు కడితే.. నంబర్లు రాస్తే రూ. 5000 ఇస్తారన్నది పరిసర ప్రాంతాల్లో వ్యాపించడంతో రోజుకు వంద నుండి 150 మంది దాకా రిజిస్ట్రేషన్ చేసేవారు. ఒక్క అంగళ్లులోనే కాకుండా కురబలకోట, ముదివేడు, పీలేరు, మదనపల్లె, రాయచోటి, కలకడ, కలికిరి, వాల్మీకిపురం, చౌడేపల్లె, పుంగనూరు, గుర్రంకొండ, నిమ్మనపల్లెతోపాటు వివిధ ప్రాంతాల మహిళలు ఎక్కువగా ఉన్నారు. కొంత మందికి మాత్రమే డబ్బులు ఇచ్చి చాలా మందికి ఇవ్వకుండా మోసం చేస్తుండడంతో విధిలేని పరిస్థితిలో బుధవారం బాదితులు ముదివేడు పోలీసులను ఆశ్రయించారు. జరుగుతున్న మోసాన్ని వెల్లడించారు. అంతేకాదు గంటల వ్యవధిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వందల మంది బాధిత మహిళలు అంగళ్లులోని ఓపీ స్టేషన్‌కు చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. రోడ్డుపై కొంత సేపు ధర్నా రాస్తారోకో నిర్వహించారు. పోలీసులు విషయం తెలియడంతో ఈ సంస్థ కార్యాలయంపై దాడులు నిర్వహించారు. రికార్డులను స్వాదీనం చేసుకున్నారు. అందులో పనిచేసే 8 మంది ఉద్యోగులను అదుపులోకి తీసుకున్నారు. విచారణ చేపట్టారు. మహిళల నుండి వచ్చిన డబ్బులను క్యూర్ కోడ్ ద్వారా బెంగళూరులోని వినోద్‌కుమార్‌కు పంపేవారమని చెబుతున్నారు. ఇతనికి అన్నమయ్య జిల్లాలో వివిధ ప్రాంతాల్లో ఇలాంటి బ్రాంచ్‌లు ఉన్నట్లు వెల్లడవుతోంది. త్వరలో మదనపల్లె కూడా కొత్త బ్రాంచ్ ఏర్పాటు చేయాలని సంకల్పించిన తరుణంలో ఇది బయటపడడంతో అంతా అవాక్కవుతున్నారు. ఈ కొత్త మోసం అన్నమయ్య జిల్లాలో తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తోంది.

కొత్తవారిని జాయిన్ చేస్తే వెయ్యి!

ఎవరైనా కొత్త వారిని జాయిన్ చేస్తే వారికి రూ.వెయ్యి చొప్పున నగదు ప్రోత్సాహం ఇచ్చేవారు. వారికి కూడా వంద డేటా ఎంట్రీ ఫారాలు ఇచ్చి సంఖ్యలు రాసుకుని రావాలని చెప్పేవారు.



ఇలా వెయ్యికి ఆశపడి పలువురు మహిళలు తెలిసిన వారితో పాటు ఇరుగుపొరుగు వారిని అధిక సంఖ్యలో చేర్చారు. బాధితుల్లో ఎక్కువ మంది ముస్లిం మైనారిటీ మహిళలు ఉండడం గమనార్హం.

వాడిని ఊరికే వదల కూడదు



ముందు మూడు వేలు చెల్లించి వంద డేటా ఫారాలను అతి కష్టం మీద రాయాలి. వేళ్లు నొప్పి పుట్టేవి...ఆపై తప్పులు లేకుండా ఏకాగ్రతతో రాయడం వల్ల కళ్లు కూడా మసకబారేవి. ఇంటివద్ద ఖాళీగా ఉంటున్నాం. ఏదో ఒకపని పార్ట్ టైమ్‌గా చేయడం ద్వారా కొంత ఆదాయం వస్తుందని ఆశపడి ఈపని చేస్తే మహిళలన్న జాలి కూడా లేకుండా నిర్వాహకుడు మోసం చేశాడు. ఇలాంటి వాడిని ఊరికే వదలకూడదు.

–తులసి, నీరుగట్టువారిపల్లె, మదనపల్లె

వంద ఫారాలు రాస్తే రూ. 5 వేలు అన్నారు



ముందుగా రూ.3 వేలు చెల్లిస్తే నిర్వాహకులు రిజిస్ట్రేషన్ చేసుకుని వంద డేటా ఎంట్రీ ఫారాలు ఇస్తారు. వీటికి రెండు వైపులా వారిచ్చిన సంఖ్యలు రాయాలి. వాటిని తెచ్చి అన్ని కరెక్టుగా ఉంటే రూ.5 వేలు ఇస్తారు. ఇలా కొందరికి మాత్రమే ఇచ్చారు. బాధితులంతా సామాన్య, మధ్యతరగతి వారే. మాకు న్యాయం చేయాలి.

–సబిహా, బాధితురాలు, మదనపల్లె

బాధితులకు న్యాయం జరిగేలా చూస్తాం



జిల్లాలోని వివిధ ప్రాంతాల వారే కాకుండా కర్నాటకలోని రాయల్పాడు ప్రాంతం వారు కూడా బాధితులుగా ఉన్నారు. ఇంతగా మహిళలు మోసం పోవడం విచిత్రంగా ఉంది. బుధవారం ఒక్క రోజే 200 మందికి పైగా బాధితులు వచ్చారు. ఫిర్యాదులు తీసుకున్నాం. ఎలైట్ క్రూప్స్ డేటా నిర్వాహకులు బెంగళూరు వాసి. ఇతనిపై కేసు నమోదు చేశాం. ఇతని కోసం ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేశాం. ఇంకా బాధితులు ఉంటే ఫిర్యాదు చేయవచ్చు. బాధితులకు న్యాయం జరిగేలా చూస్తాం.

–సత్యనారాయణ, రూరల్ సర్కిల్ సీఐ, మదనపల్లె

ఘనంగా సద్గురు దర్గా స్వామి జయంతి



దర్గా స్వామీజీకి పుష్పాలంకరణ

రామాపురం (రాయచోటి జగదాంబసెంటర్): రామాపురం మండలం నీలకంఠ్రావుపేట గ్రామంలోని సాయి నగర్‌లో వెలసిన శ్రీ సద్గురు దర్గా స్వామీజీ 95వ జయంతిని బుధవారం నిర్వాహకులు వైభవంగా నిర్వహించారు. పరిపూర్ణతరుడు, పరబ్రహ్మ స్వరూపుడు, పరమాత్ముడు, దత్త స్వరూపుడు అయిన సమర్థ దర్గా స్వామీజీ జయంతి వేడుకలకు పలు ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. సద్గురువు అయినటువంటి దర్గా స్వామీజీ ఆశీస్సులను వారు పొందారు.

సికింద్రాబాద్ - తిరుపతి మధ్య ప్రత్యేక రైలు

కడప కోటిరెడ్డి సర్కిల్: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా సికింద్రాబాద్ – తిరుపతి మధ్య ప్రత్యేక రైలు నడుపుతున్నారని కడప రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. 07009 నంబరుగల రైలు ప్రతి గురువారం సికింద్రాబాద్‌లో ఈనెల 31, ఆగస్ట్ 7, 14, 21, 28వ తేదీల్లో, 07010 నంబరు గల రైలు తిరుపతి నుంచి సికింద్రాబాద్‌కు ప్రతి శుక్రవారం ఆగస్ట్ 1, 8, 15, 22, 29వ తేదీల్లో నడుస్తుందన్నారు. సికింద్రాబాద్‌లో ప్రతి గురువారం రాత్రి 10గంటలకు బయలుదేరి కాచిగూడ, షాద్ నగర్, జడ్చర్ల, మహబూబ్ నగర్, కర్నూలు సిటీ, డోన్, గుత్తి, తాడిపత్రి, ఎర్రగుంట్ల మీదుగా కడపకు ఉదయం 7.05గంటలకు చేరుకుని, రాజంపేట, రేణిగుంట మీదుగా తిరుపతికి ఉదయం 10.30గంటలకు చేరుకుంటుందన్నారు. అలాగే ప్రతి శుక్రవారం తిరుపతిలో సాయంత్రం 4.40గంటలకు బయలుదేరి ఇదే మార్గంలో సికింద్రాబాద్‌కు ఉదయం 6.45గంటలకు చేరుతుందని ఆయన తెలిపారు.

ఓ పట్టాన ప్రకటించరే!

- డిగ్రీ ప్రవేశాలకు విద్యార్థుల ఎదురు చూపులు
- ఎస్వీయూ పరిధిలో ప్రారంభం కాని కౌన్సెలింగ్

మదనపల్లె సిటీ: డిగ్రీ అడ్మిషన్లపై కూటమి ప్రభుత్వం ఎటూ తేల్చనంటోంది. ఇంటర్మీడియట్ ఫలితాలొచ్చి రెండు నెలలవుతున్నా డిగ్రీ అడ్మిషన్ల నోటిఫికేషన్ ఇవ్వకపోవడం విమర్శలకు తావిస్తోంది. భవిష్యత్తులో డిగ్రీ పట్టా అందుకోవాల్సిన విద్యార్థులు కోర్సుల్లో ప్రవేశానికి ఎదురు చూస్తున్నారు. జులై మొదటి వారానికి డిగ్రీ ప్రవేశాలు పూర్తయి తరగతులు మొదలుకావాలి. సగం రోజులు పూర్తికావొస్తున్నా ఎస్వీ యూనివర్సిటీ నుంచి కౌన్సెలింగ్ ప్రకటన వెలువడ లేదు. ఓ వైపు ఇంజినీరింగ్ ప్రవేశాలకు ఏర్పాట్లు జరుగుతుండగా, డిగ్రీ ప్రవేశాలపై ఇంత వరకు ఎలాంటి కదలిక లేకపోవడం గమనార్హం. ఏ కోర్సులో చేరాలి .. అందుబాటులో ఉన్న డిగ్రీ కళాశాలలో కోరుకున్న సీటు దక్కుతుందో లేదోనని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో తొమ్మిది ప్రభుత్వ, 30కిపైగా ప్రైవేటు డిగ్రీ కాలేజీలు ఉన్నాయి. ఇందులో సుమారు 10 వేల వరకు సీట్లు అందుబాటులో ఉన్నాయి. గత ఏడాది ఆన్‌లైన్ విధానంలో కౌన్సెలింగ్ నిర్వహించి డిగ్రీ ప్రవేశాలు పూర్తి చేశారు. ఈ ఏడాది ఆన్‌లైన్‌లో చేయాలా. నేరుగా చేయాలనే దానిపై కొంత కాలంగా తర్జనభర్జన పడుతున్నారు. మరో వైపు డిగ్రీలో సబ్జెక్టుకు సంబంధించి సింగిల్ మేజరా.. డబుల్ మేజరా అనే దానిపైనే చర్చ నడుస్తోంది. ఈ రెండింటిపై ఇంత వరకు ఉన్నత విద్యా మండలి నుంచి స్పష్టత రాలేదు. ఈ ప్రభావం డిగ్రీ ప్రవేశాలపై కూడా ఉంది. కౌన్సెలింగ్ ప్రకటన ఎప్పుడు వస్తుందా.. అని నిరీక్షిస్తున్నారు. ఇంజినీరింగ్ వంటి కోర్సుల్లో చేరేందుకు ఆర్థిక స్థోమత లేని పేద విద్యార్థులకు డిగ్రీనే ఆధారం. ఓ వైపు కళాశాలకు వెళుతూనే సాయంత్రం సమయంలో ట్యూషన్లు వంటివి చెప్పుకుంటూ పార్ట్‌టైమ్ ఉద్యోగాలు చేస్తూ చదివే వారు ఉన్నారు. ముఖ్యంగా అమ్మాయిలు తాము నివాసం ఉన్న ప్రాంతంలోని డిగ్రీ కాలేజీలో సీటు దక్కుతుందో లేదోనని ఆందోళన చెందుతున్నారు. ఇలాంటి వారంతా ఇంత తక్కువ సమయంలో కౌన్సెలింగ్ ప్రకటన వెలువడితే డిగ్రీలో ఏ సబ్జెక్టు ఎంపిక చేసుకోవాలి.. కళాశాల ఉండే ప్రాంతంలో వసతి సౌకర్యం ఎలా అన్న దానిపై ఆందోళన చెందుతున్నారు.

- అడ్మిషన్ల ప్రక్రియ ప్రకటనలో జరుగుతున్న జాప్యాన్ని ప్రైవేటు కాలేజీలో తమకు అనుకూలంగా మార్చుకున్నాయి. ఇంటర్ ఫలితాలు వచ్చిన వెంటనే విద్యార్థులను చేర్చుకోవడంతో పాటు మార్కుల జాబితాను,టీసీ,ఇతర సర్టిఫికెట్లను ప్రైవేటు కాలేజీలు సేకరిస్తున్నాయి. ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైన వెంటనే ఇప్పటికే చేరిన వారిని దరఖాస్తు చేయించి తమ కాలేజీలను ఆప్షన్లుగా ఎంచుకునే విధంగా ఏర్పాట్లు చేసుకున్నాయి.



మదనపల్లెలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ

సమయం లేదు మిత్రమా?

ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహించినా అది నెలకుపైగా సాగుతుంది. గతంలో రెండు నెలల సమయం వరకు షెడ్యూలు ఇచ్చి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా ప్రక్రియ నిర్వహించేవారు. కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు షెడ్యూలే ఇవ్వకపోవడం విమర్శలకు తావిస్తోంది. తొలి విడతలో మిగిలిన సీట్లను భర్తీ చేసేందుకు మరో రెండు విడతలు ప్రక్రియ నిర్వహించాలి ఇదంతా జరిగి క్లాసులు ప్రారంభమయ్యే సరికి ఆగస్టు నెల వచ్చేస్తుందని విద్యార్థి సంఘ నాయకులు ఆరోపిస్తున్నారు.

ఆఫ్‌లైన్ కోసమే ఆలస్యమా?

డిగ్రీ విద్యార్థులకు అడ్మిషన్ల ప్రక్రియను సలభతరం చేసేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2022–23లో ఆన్‌లైన్ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా సులువుగా ఆన్‌లైన్ విధానంలో అడ్మిషన్లు పొందేవారు. కూటమి ప్రభుత్వం ఆన్‌లైన్ విధానాన్ని రద్దు చేసి తిరిగి ఆఫ్‌లైన్‌లో అడ్మిషన్లు చేపట్టేందుకు కుట్ర పన్నుతున్నట్లు తెలుస్తోంది. ఇందు కోసమే అడ్మిషన్లలు ప్రక్రియ ఇంకా ప్రారంభించలేదని విద్యార్థి సంఘ నాయకులు ఆరోపిస్తున్నాయి.

అడ్మిషన్లు ప్రారంభించాలి



డిగ్రీ అడ్మిషన్లను వెంటనే ప్రారంభించాలి. విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు అడ్మిషన్లు ప్రారంభించకపోవడంతో విద్యార్థులు తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారు.

–మాధవ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి

డిగ్రీ విద్యను నిర్వీర్యం చేసే కుట్ర



డిగ్రీ విద్యార్థులతో ప్రభుత్వం చెలగాటమాడుతోంది. సింగల్ మేజర్, డబుల్ మేజర్ అంటూ డిగ్రీ విద్యను నిర్వర్యం చేసే కుట్ర చేస్తోంది. వెంటనే అడ్మిషన్ల నోటిఫికేషన్ విడుదల చేయాలి.

–నరసింహ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు

కబ్జా కోరల్లో వక్ఫ్ భూములు

- రూ. 300 కోట్ల భూములు అన్యాక్రాంతం
- పట్టించుకోని అధికారులు

గుర్రంకొండ: గుర్రంకొండతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో సుమారు రూ.300 కోట్లు విలువ చేసే వక్ఫ్‌బోర్డుభూములు కబ్జాకు గురయ్యాయి. ఒక్క గుర్రంకొండ పట్టణంలోనే రూ. 200 కోట్ల విలువచేసే వక్ఫ్ స్థలాలు అన్యాక్రాంతమయ్యాయి. కడప–బెంగుళూరు జాతీయరహదారికి ఇరువైపు లా పట్టణంలో విలువైన వక్ఫ్‌బోర్డు స్థలాలు ఉన్నా యి. ఏళ్ల తరబడి వీటి ఆలనాపాలనా పట్టించుకొనే అధికారులు లేకపోవడంతో విలువైన స్థలాలు కబ్జా కు గురయ్యాయి. పట్టణంలో అధికశాతం మంది మైనార్టీలు నివసిస్తున్నారు. అయితే వీరికి ఏమా త్రం వక్ఫ్ స్థలాలు ఉపయోగపడడంలేదు. కొంతమంది కబ్జా కోరులు ఇష్టానుసారం వీటిని ఆక్రమించుకొని దర్జాగా అనుభవిస్తున్నారు. కనీసం మైనార్టీ లకు అవసరమైన షాదీమహల్, ఉర్దూ ఐటీఐ వంటి ప్రభుత్వసంస్థల నిర్మాణానికి అవసరమైన స్థలాలు కూడా లభ్యం కాని పరిస్థితి నెలకొడం దారుణమని మైనార్టీలు చర్చించుకుంటున్నారు.



చిట్టిబోయనపల్లె రెవెన్యూ గ్రామంలో మైనార్టీ ఐటీఐ కోసం స్థలాన్ని సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు

శిలాఫలకంలో భద్రంగా ఉన్న షాదీమహల్

గుర్రంకొండలలో వందల ఎకరాల వక్ఫ్ భూములున్నా మైనార్టీలకు అవసరమైన భవనాలు, షాదీమహల్ నిర్మించేందుకు కావాల్సిన స్థలాలకు మాత్రం కొరత ఏర్పడింది. 11 ఏళ్లకిందట షాదీమహల్‌నిర్మాణానికి మంజూరైన రూ.50లక్షల నిధులు వినియోగించక నిర్వీర్యమతువుతున్నాయి. జిల్లాలో మొదటిసారిగా గుర్రంకొండకు మైనార్టీ ఐటీఐ మంజూరురైంది. ఇందుకోసం అప్పట్లో ప్రభుత్వం రూ. 10 కోట్లు నిధులు మంజూరు చేసింది. గత 11ఏళ్లగా షాదిమహల్ నిర్మాణం శిలాఫలకంలో భద్రంగా ఉంది. మైనార్టీల ఐటీఐకి మాత్రం స్థల అన్వేషణలో అధికారులు ఉన్నారు.

మూడు సార్లు నిధుల మంజూరు

1999లో ఇక్కడ షాదీ మహల్ మంజూరైంది. అప్పట్లో షాదీమహల్ అభివృద్ధి కమిటి ఏర్పాటు చేసి రూ. 5లక్షలు నిధులు మంజూరు చేశారు. గ్రామంలోని వక్ఫ్ బోర్డు స్థలంలో ఐదు సెంట్ల స్థలం కేటాయించారు. అని వార్యకారణాలతో నిర్మాణం జరగలేదు. 2004లో మళ్లీ రెండో సారి మంజూరైంది. అప్పట్లో రూ.10 లక్షలు నిధులు మంజూరయ్యాయి. మళ్లీ స్థలం ఎంపిక సమస్య మారడంతో నిలిచిపోయింది. గ్రామంలో విలువైన మైనార్టీల భూములున్నా షాదీమహల్‌కు అవసరమైన స్థలం లేక పోవడం గమనార్హం. మళ్లీ 2013లో అప్పటి సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి షాదీ మహల్ మంజూరుచేసి నిర్మాణానికి అవసరమైన రూ. 50 లక్షల నిధులు మంజూరు చేశారు. అదే ఏడాది మేనెల 27న నిర్మాణానికి శంకుస్థాపన కూడా చేశారు. అయినా నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. ఇప్పటికీ మూడు సార్లు నిధులు మంజూరై వెనక్కు వెళ్లిపోయాయి.




షాదీమహల్ నిర్మాణానికి 2013లో వేసిన శిలాఫలకం

స్థలం కోసం అన్వేషణ

జిల్లాలో ఎక్కడా లేని విధంగా గుర్రంకొండలో మా త్రమే మైనార్టీ ఐటీఐ మంజూరైంది. ఇందుకు అవ సరమైన స్థలాన్ని రెవెన్యూ అధికారులు పరిశీలించి ప్రతిపాదనలు పంపాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. గతంలో ప్రభుత్వం రూ. 10 కోట్ల ని ధులను కేటాయించింది. కళాశాల ఏర్పాటు కోసం 10 ఎకరాల స్థలం అవసరం అవుతుంది. గుర్రంకొండ పరిసరాల్లోని ప్రభుత్వ భూములను సర్వేచే సి ప్రతి పాదనలు పంపించాలంటూ అప్పట్లో జిల్లా కలెక్టర్ స్థానిక రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జా రీ చేశారు. గ్రామంలో మైనార్టీలకు చెందిన వివిధ రకాల వందలాది ఎకరాల భూములున్నా అందులో పట్టుమని 10 ఎకరాల స్థలం లభించలేదు. దీంతో చేసేదిలేక రెవెన్యూ అధికారులు చిట్టిబోయనపల్లె రెవెన్యూ గ్రామంలోని గుట్టల్లో 5.06 ఎకరాల స్థలాన్ని సర్వేచేసి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపారు. అయితే ప్రభుత్వ నిబంధనల మేరకు ఇంకా ఐదు ఎకరాల స్థలం అవసరం అవుతుంది. గ్రామంలో వందలకోట్లు కోట్లు విలువ చేసే మైనార్టీల భూములున్నా వారికి అవసరమైన ప్రభుత్వ భవన నిర్మాణాలకు కావాల్సిన స్థలాలు మాత్రం దొరక్క పోవడం గమనార్హం.

కలెక్టర్ దృష్టికి తీసుకెళతాం



గుర్రంకొండలో షాదీమహల్, మైనార్టీల ఐటీఐ నిర్మాణాలకు అవసరమైన స్థలాల సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళతాం. త్వరలో అన్యాక్రాంతమైన వక్ఫ్‌బోర్డు భూములన్నింటిపై పూర్తి స్థాయిలో విచారణ జరుపుతాం.

– వసీమ్ అక్రమ్, వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్, అన్నమయ్య జిల్లా

టీడీపీ కుట్రలు భగ్నం



శ్రీధర్‌రెడ్డికి డిక్లరేషన్ పత్రాన్ని అందిస్తున్న ఎన్నికల అధికారి లక్ష్మీపతి

సంబేపల్లి: సంబేపల్లె మండల పరిషత్ ఉపాధ్యక్షుడు–1 పదవి కోసం టీడీపీ చేసిన కుట్రలు భగ్నమయ్యాయి. సంఖ్యాబలం లేకపోయినా వైస్ ఎంపీపీ ఎన్నికల్లో రాజకీయ కుట్రకు తెరలేపింది. వైఎస్సార్‌పీకి చెందిన ఎంపీటీసీలను మభ్యపెట్టి, భయపెట్టి స్థానాన్ని కైవసం చేసుకునే ప్రయత్నం చేసిన అధికార పార్టీ విఫలమైంది. వైఎస్సార్

మండల వైస్ ఎంపీపీ వైఎస్సార్‌సీపీదే

సీపీ గుర్తుతో గెలిచిన ఎంపీటీసీలు పార్టీ నిర్ణయానికి కట్టుబడి అధిష్టానం సూచించిన అభ్యర్థిని గెలిపించుకున్నారు. ఇటీవల వైస్ ఎంపీపీ రాజీనామ చేయంతో ఆ స్థానం ఖాళీ ఏర్పడింది. బుధవారం డీఎల్‌డీఓ లక్ష్మీపతి అధ్యక్షతన పోలీసు బందోబస్తు నడుమ ఎన్నిక నిర్వహించారు. ఆరుగురు సభ్యులు హాజరయ్యారు. నాగిరెడ్డిగారిపల్లె ఎంపీటీసీ జి. రమాదేవి ప్రతిపాదన మేరకు గున్నికుంట్ల ఎంపీటీసీ కె.శ్రీధర్‌రెడ్డి పోటీలో నిలిచారు.దుద్యాల ఎంపీటీసీ ఎం. భాగ్యమ్మ, నారాయణరెడ్డిపల్లె ఎంపీటీసీ డి రాజకుమారి, రౌతుకుంట ఎంపీటీసీ చిన్న భద్రయ్య, శెట్టిపల్లె యం.సీతమ్మలు బలపరిచారు. ఎన్నికల్లో ఎవరూ పోటీ చేయకపోవండతో ఏకగ్రీవంగా మండల ఉపాధ్యక్షుడిగా కేతంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు డిక్లరేషన్ పత్రాన్ని అందజేశారు.

క్లుప్తంగా

వ్యక్తి అదృశ్యం

పెద్దతిప్పసముద్రం : మండలంలోని కాయల వాండ్లపల్లికి చెందిన పెద్దపాళ్యం రామచంద్ర కుమారుడు పి.రాజశేఖర్(44) అదృశ్యమైనట్లు తల్లి క్రిష్టమ్మ తెలిపారు. ఈ నెల 9వ తేదీన తిరుమల వెంకటేశ్వర స్వామి దర్శనం కోసమని ఇంటి నుంచి బయలు దేరాడని, ఇంతవరకూ ఇంటికి రాలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. గాలించినా ప్రయోజనం లేకపోవడంతో బుధవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆమె పేర్కొంది.

గిరిజన కుటుంబాలను ఆదుకుంటాం


మృతుల కుటుంబాలతో మాట్లాడుతున్న తేజశ్వని

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని శెట్టిగుంట ఎస్టీకాలనీలో ప్రమాదంలో మృతి చెందిన అన్ని కుటుంబాలను ఆదుకుంటామని గిరిజన సంక్షేమ శాఖ అధికారిణి తేజశ్వని పేర్కొన్నారు. గ్రామంలో బుధవారం ఆమె పర్యటించి గిరిజనుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే మృతి చెందిన ప్రతి కుటుంబాన్ని సందర్శించి వారికి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి రావాల్సిన నష్ట పరిహారం అందేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ అధ్యక్షులు శివశంకర్, తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనదారులపై కేసు నమోదు

సిద్దవటం : మద్యం తాగి నడుపుతున్న ద్విచక్ర వాహనదారులపై బుధవారం కేసులు నమోదు చేశామని ఎస్ఐ మహమ్మద్‌రఫీ తెలిపారు. సిద్దవటం పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ మాట్లాడుతూ కడప-చెన్నై ప్రధాన రహదారిలోని భాకరాపేట చెక్ పోస్టు వద్ద సోమవారం రాత్రి తనిఖీ చేస్తుండగా మద్యం తాగి ద్విచక్ర వాహనంలో వస్తున్న శివ, తుమ్మల ప్రవీణ్ కుమార్‌ల పట్టుబడడంతో కేసులు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

పోక్సో కేసు నమోదు

పెద్దమండ్యం : మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన యువకునిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. మండలంలోని వెలిగల్లు పంచాయతీ గురికివాండ్లపల్లెకు చెందిన యువతి కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తోంది. ఆమె కుమార్తె (15) పాపదాతగారిపల్లెలోని ఉన్నత పాఠశాలలో పదవతరగతి చదువుతోంది. ఈ క్రమంలో ఈ నెల 6న ఇంటి వద్ద బాలిక ఉండగా గాలివీడుకు చెందిన మల్లెల రామక్రిష్ణ (19) మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. సంఘటనపై మంగళవారం రాత్రి బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె రూరల్ : అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన బుధవారం ములకలచెరువు మండలంలో జరిగింది. ములకలచెరువు రాజా నగర్‌కు చెందిన గంగన్న కుమారుడు నరసింహులు(60) గత కొంతకాలంగా షుగర్, బీపీతోపాటు, కడుపునొప్పితో బాధ పడుతున్నాడు. వ్యాధి నివారణకు చికిత్స తీసుకున్నా ఫలితం కనిపించకపోవడంతో మనస్తాపం చెందాడు. బుధవారం ఇంటి వద్దే సూపర్ వాస్మాల్ తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన కుటుంబసభ్యులు బాధితుడిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ములకలచెరువు పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

నకిలీ పత్రాలతో నిరుద్యోగులకు వల

జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



రాయచోటి : నకిలీ కంపెనీలు చూపి ఉద్యోగాలిస్తామంటూ నిరుద్యోగ యువతకు మోసగాళ్లు వల వేస్తున్నారని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అన్నమయ్య జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు ఓ ప్రకటనలో సూచించారు. నకిలీ కంపెనీలు, ఫేక్ నోటిఫికేషన్లు, జాతీయ, అంతర్జాతీయ ఉద్యోగావకాశాల పేరిట మోసగాళ్లు డబ్బు వసూలు చేస్తున్నారన్నారు. ఎక్కువమంది యువత అధిక ఆదాయం ఆశతో మోసానికి గరవుతున్నారన్నారు. యూపీఎస్సీ, ఎస్ఎస్‌సీ, ఏపీపీఎస్‌సీ వంటి సంస్థల పేరుతో ఫేక్ అపాయింట్‌మెంట్ లెటర్లు సృష్టిస్తున్నట్లు తెలిపారు. ఒక్కసారి ఫీజు చెల్లిస్తే ఉద్యోగం ఖాయం అనే నకిలీ వెబ్‌సైట్లు, డొమెయిన్ ఉపయోగించడం, ఐటీ ఇతర దేశాల్లో ఉద్యోగాలున్నాయని నమ్మబలకడం చేస్తున్నారని తెలిపారు. ప్రాసెసింగ్ ఫీజు, వీసా చార్జీలు పేరిట పెద్దమొత్తంలో డబ్బులు వసూళ్లు చేస్తారన్నారు. ఇంటర్వ్యూ లేకుండా నేరుగా ఆఫర్ లెటర్ పంపించే విషయంపై అప్రమత్తంగా ఉండాలని, జాబ్ అప్లికేషన్ పేరిట వ్యక్తిగత డేటా తీసుకొని అక్రమాలకు ఉపయోగిస్తారని పేర్కొన్నారు. బ్యాంక్ డీటెయిల్స్, ఓటీపీలు, ఆధార్ కార్డు, పాన్ కార్డు సమాచారం తీసుకుంటారు జాగ్రత్తగా ఉండాలన్నారు. అధికారిక వెబ్‌సైట్లలో పరిశీలించాలని, వ్యక్తిగత సమాచారం, బ్యాంక్ డీటెయిల్స్ ఎవరికీ పంపించరాదన్నారు. ఎవరికైనా సమస్య తలెత్తితే సైబర్ హెల్ప్‌లైన్ 1930, సైబర్ క్రైమ్ పోర్టల్ సైబర్‌క్రైమ్. జీఓవి.ఇన్, అత్యవసర సమాచారం కోసం మీ సమీప పోలీస్ స్టేషన్ లేదా సైబర్ క్రైమ్ సెల్‌ను సంప్రదించాలన్నారు.

కుర్చీలతో కొట్టుకున్న తెలుగు తమ్ముళ్లు

పెద్దమండ్యం : గ్రామ కమిటీ ఎన్నిక రసాభసగా మారింది. సమావేశంలో సమస్యలు తెలుపుకొనే నేపథ్యంలో తెలుగు తమ్ముళ్లు ఘర్షణకు దిగడం విభేధాలు బయటపడ్డాయి. కమిటీ ఎన్నికలు నిర్వహించేందుకు వచ్చిన అబ్జర్వర్ సమక్షంలోనే ఒకరిపై ఒకరు కుర్చీలతో దాడులు చేసుకోవడం చర్చనీయాంశమైంది. వివరాలలోకి వెళితే.. స్థానిక బస్టాండు కూడలికి సమీపంలోని ఓ రైస్ మిల్లు వద్ద పెద్దమండ్యం గ్రామ కమిటీ అధ్యక్షుడి ఎన్నికపై సమావేశం జరిగింది. పరిశీలకులు దినేష్‌రెడ్డి, శ్రీనివాసులు కార్యకర్తల అభిప్రాయాలను అడిగారు. అయితే గ్రామంలో గత కొంత కాలంగా తెలుగు తమ్ముళ్లు రెండు వర్గాలుగా విడిపోయారు. పరిశీలకులకు ఒక్కొక్కరు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. ఈ సమయంలో రెండు వర్గాల వారి మధ్య వాదన జరిగి గొడవకు దారి దీసింది. అక్కడే ఉన్న కుర్చీలతో ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో ఇద్దరు గాయపడ్డారు. తెలుగుతమ్ముళ్లు కొట్టుకుంటున్న విషయమై స్థానిక పోలీసులకు సమాచారం అందడంతో వారు చేరుకుని ఇరువర్గాల వారిని బయటకు పంపించేశారు. రెండు వర్గాలలో స్వల్పంగా గాయపడిన ఇద్దరిని స్టేషన్‌కు పిలిపించి రాజీ చేసి పంపినట్లు సమాచారం.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి


తీవ్ర గాయాలతో శ్రీనివాసులు


వీరాంజనేయులు (ఫైల్ ఫోటో)

చిన్నమండెం : కడప-బెంగళూరు జాతీయ రహదారిలోని బెస్తపల్లె క్రాస్ సమీపంలో ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఉసిరికాయల వీరాంజనేయులు(40) మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. పోలీసుల కథన మేరకు.. మండల పరిధిలోని కేశాపురానికి చెందిన వీరాంజనేయులు, శ్రీనివాసులు తమ సొంత పనుల నిమిత్తం చిన్నమండెంకు వచ్చి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగిందన్నారు. వీరాంజనేయులు అక్కడికక్కడే మృతిచెందగా గాయపడిన శ్రీనివాసులును 108 సాయంతో రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు తెలిపారు. వారిరువురూ ఇటీవలే కువైట్ నుంచి రాగా.. మళ్లీ తిరిగి అక్కడికి వెళ్లాల్సి ఉంది. మృతుడు వీరాంజ నేయులు భార్య కువైట్‌లో ఉండగా వారికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చిన్నమండెం పోలీసులు తెలిపారు.

ఆకులవారిపల్లెలో కోడి పందాలు

– పోలీసుల దాడుల్లో నలుగురు అరెస్ట్

బి.కొత్తకోట : మండలంలోని ఆకులవారిపల్లె చెరువులో బుధవారం భారీ స్థాయిలో కోడి పందాలు నిర్వహిస్తుండగా పోలీసులు దాడులు నిర్వహించారు. బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం, ములకలచెరువు, తంబళ్లపల్లె మండలాల నుంచి వచ్చిన వారితో పెద్దమొత్తంలో కోడి పందేలు నిర్వహిస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. దీంతో అందుబాటులో ఉన్న సిబ్బందితో హెడ్‌కానిస్టేబుల్ బి.విశ్వనాథరెడ్డి దాడులు నిర్వహించారు. ఈ విషయాన్ని పసిగట్టిన కొడిపందెం రాయుళ్లు పరుగులు తీశారు. ఒక కోడి, ఏడు బైక్‌లు, రూ.700 నగదు స్వాధీనం చేసుకున్నారు. కటారి అంజి(50), రామరాజుపల్లె శ్రీనివాసులురెడ్డి(45), చిప్పల మడుగు మోహన(43), తుపాకుల వెంకటరమణ(38)లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని విశ్వనాథరెడ్డి తెలిపారు. సిబ్బంది తక్కువ సంఖ్యలో ఉండటంతో నలుగురిని పట్టుకోగలిగామని మిగిలిన వాళ్లు కోళ్లు, డబ్బుతో పరారయ్యారని తెలిపారు.

జర్నలిస్ట్ ఆరోగ్య బీమా పొడిగింపు

కడప సెవెన్ రోడ్స్ : రాష్ట్ర ప్రభుత్వం వర్కింగ్ జర్నలిస్టుల ఆరోగ్య బీమా గడువు 2025–26 ఆర్థిక సంవత్సరానికి పొడిగించిందని ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితిసింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. జర్నలిస్టులు, వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులకు ఏదైనా అనుకోని అనారోగ్యం సంభవించిన ప్రతిసారీ రూ.2 లక్షల విలువ చేసే వైద్య సేవలు అందుతాయన్నారు. ఏడాది కాలంలో ఎన్నిసార్లైనా పరిమితులు లేకుండా ఈ సదుపాయాన్ని అందిస్తారని తెలిపారు. అక్రిడిటేషన్ పొందిన జర్నలిస్టులందరూ ఈ సదుపాయాన్ని వినియో గించుకోవాలన్నారు. వచ్చే ఏడాది మార్చి 31 వరకు హెల్త్ స్కీం ద్వారా లబ్ధి పొందవచ్చన్నారు.

కృష్ణచైతన్య ఫార్మసీ కళాశాలలో విచారణ


గేటు ఎదుట నిరసన తెలుపుతున్న రామ్మోహన్‌రెడ్డి, డైరెక్టర్లు

మదనపల్లె రూరల్ : మండలంలోని రామాచార్లపల్లె కృష్ణ చైతన్య ఫార్మసీ కళాశాలలో సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.కృష్ణ బుధవారం విచారణ చేపట్టారు. సర్టిఫికేట్లు ఇప్పించాలంటూ సబ్ కలెక్టర్ కార్యాలయంలోని పీజీఆర్ఎస్‌లో విద్యార్థులు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో, కళాశాల డైరెక్టర్లు, అధ్యాపకులు, విద్యార్థులను వేర్వేరుగా ఆయన విచారించారు. కళాశాలకు చెందిన ఎడ్యుకేషనల్ సొసైటీలోని ఓ వర్గానికి చెందిన సెక్రటరి, ప్రిన్సిపల్ శశివర్ధన్‌రెడ్డి, డైరెక్టర్లు శ్యామలమ్మ, గోవర్ధన్‌రెడ్డి, ఎర్రంరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, అమరావతిని విచారించారు. వారు మాట్లాడుతూ....ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించి ప్రభుత్వం రెండు కంతులు విడుదల చేసినా తమ కళాశాల విద్యార్థులకు జమ కాలేదన్నారు. మరో వర్గానికి చెందిన డైరెక్టర్లు అడ్డుపడుతుండడంతో సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. అధ్యాపకులకు వేతనాలు అందించడం కష్టంగా ఉందని, రీయంబర్స్‌మెంట్ విడుదల ఆలస్యం కావడంతో యాజమాన్యం ఒత్తిడి తెస్తోందని, అప్పులు చేసి ఫీజులు చెల్లించాల్సి వస్తోందని విద్యార్థులు వాపోయారు. విచారణ అనంతరం సోషల్ వెల్ఫేర్ డీడీ కృష్ణ మాట్లాడుతూ నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామని, ఎలాంటి పరిస్థితుల్లోనూ విద్యార్థులు నష్టపోకూడదని యాజమాన్యానికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఏఎస్‌డబ్ల్యూఓ గంగిరెడ్డి, వార్డెన్ రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఏకపక్షంగా సోషల్ వెల్ఫేర్ డీడీ విచారణ

మదనపల్లె రూరల్ : కృష్ణ చైతన్య ఫార్మసీ కళాశాలలో జిల్లా సోషల్ వెల్ఫేర్ డీడీ ఏకపక్షంగా విచారణ చేశారని కరస్పాండెంట్ రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. కళాశాల గేటు వద్ద డైరెక్టర్లు మల్లికార్జున రెడ్డి, శశికుమార్‌రెడ్డి, గోపాల్‌రెడ్డిలతో కలిసి ఆయన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ...కొత్తగా సొసైటీ ఏర్పాటుచేసుకుని కళాశాలను నిర్వహించామన్నారు. ఈ విషయమై హైకోర్టులో కేసు వేస్తే తీర్పు తనకు అనుకూలంగా వచ్చిందన్నారు. అయితే, రెండు నెలల క్రితం ఓ వర్గం కళాశాలను దౌర్జన్యంగా ఆక్రమించుకుని నిర్వహిస్తోందన్నారు. ఈ విషయాన్ని తాము సోషల్ వెల్ఫేర్ డీడీకి తెలిపేందుకు వస్తే, గేట్లు మూసివేసి లోనికి రానివ్వకుండా దౌర్జన్యం చేస్తున్నారన్నారు. కళాశాల నిర్వహణకు సంబంధించి కోర్టులో కేసు నడుస్తున్నప్పటికీ, సోషల్ వెల్ఫేర్ డీడీ విచారణకు రావడం హైకోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించడమేనన్నారు. ఏకపక్ష ధోరణితో ఓ వర్గాన్ని మాత్రమే విచారించడం వల్ల విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారన్నారు. ఫార్మసీ కళాశాల విద్యార్థులకు ఎలాంటి నష్టం వాటిల్లినా తాము ఊరుకునేది లేదని, బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

హెచ్‌పీసీఎల్ ప్లాంట్ సిబ్బందికి అవగాహన


హెచ్‌పీసీఎల్‌లో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న సిబ్బంది

సిద్దవటం : పరిశ్రమలకు బాంబు బెదిరింపులు వచ్చినపుడు సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని కడప ఏఆర్ అడిషనల్ ఎస్పీ రమణయ్య సూచించారు. మండలంలోని భాకరాపేట సమీపంలోని హిందూస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్(హెచ్‌పీసీఎల్) ప్లాంట్ సిబ్బందికి బుధవారం అవగాహన కల్పించి.. మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ రమణయ్య మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల సమయంలో ఉద్యోగుల అప్రమత్తత పెంచేందుకు ఈ మాక్‌డ్రిల్ ఉపయోగ పడుతుందన్నారు. భద్రతా ప్రమాణాలు, చర్యలపై అవగాహన కల్పించడంతో మాక్ డ్రిల్ సమయంలో ప్లాంట్ నుంచి సురక్షితంగా ఖాళీ చేయించగలిగామన్నారు. పరిసర భద్రతా బాంబు స్క్వాడ్ సమన్వయంతో సిబ్బంది, భద్రతా బృందాలు చక్కగా పని చేశాయని అధికారులు అభినందించారు. ఈ మాక్ డ్రిల్ ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, కడప పరిశ్రమల శాఖ భద్రతాధికారి సతీష్, బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్ ఇన్‌చార్జి శివరాముడు, సిబ్బంది పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరికి జైలు శిక్ష


నిందితులు మల్లికార్జున, రత్నమ్మ

సిద్దవటం : ప్రభుత్వ ఉద్యోగిపై హత్యాయత్నం, ప్రభుత్వ ఆస్తిని నష్టం కలిగించిన కేసులో రాజోలి మల్లికార్జున, ఆయన తల్లి రాజోలి రత్నమ్మలకు రెండున్నర సంవత్సరాల జైలు శిక్ష, ఒక్కొక్కరికీ రూ. 1000 జరిమానా విధిస్తూ బద్వేల్ సీనియర్ సివిల్ జడ్జి పద్మశ్రీ బుధవారం తీర్పు వెలువరించినట్లు సిద్దవటం ఎస్ఐ మహమ్మద్‌రఫీ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ మాట్లాడుతూ సిద్దవటం కోర్టు జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న గుమ్మల్ల రామక్రిష్ణారెడ్డి సిద్దవటం జడ్జి జిల్లా జడ్జి కాన్ఫరెన్స్‌కు వెళ్లారు. 2018 డిశంబర్, 29న ముద్దాయిలు అయిన మల్లికార్జున ఆయన తల్లి రాజోలి రత్నమ్మలను పిలిచి జడ్జి కడపకు వెళ్లడంతో కేసు వాయిదా వేస్తున్నామని రికార్డ్ అసిస్టెంట్, తదితరులు చెప్పారన్నారు. దీంతో కోర్టు హాలులోనే గట్టిగా కేకలు వేసి కోర్టు మర్యాదకు భంగం కలిగించేలా మల్లికార్జున, రత్నమ్మ ప్రవర్తించారని, కోర్టు కానిస్టేబుల్ అడ్డు రాగా కాలర్ పట్టుకొని పిడి గుద్దులు గుద్దారని తెలిపారు. కానిస్టేబుల్‌ను గాయపరచడమేగాక, సిబ్బందిని బూతులు తిట్టి కోర్టులో కుర్చీలు, బల్లలను పగుల కొట్టడం జరిగిందన్నారు. అప్పటి సిద్దవటం ఎస్ఐ అరుణ్‌రెడ్డి దీనిపై కేసు నమోదు చేసి విచారణ చేశారన్నారు. నేరం రుజువు కావడంతో నిందితులు ఇద్దరికీ శిక్ష విధించారన్నారు. సాక్షాధారులను సకాలంలో ప్రవేశపెట్టి నేరం ఋజువు చేసి శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు అధికారులను, సిబ్బందిని జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ అభినందించినట్లు ఎస్ఐ తెలిపారు.

మున్సిపల్ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన


రాజంపేటలో అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న కార్మికులు

రాజంపేట : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాజంపేట మున్సిపల్ కార్మికులు బుధవారం అర్ధనగ్నంగా నిరసన తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్వేలి రవికుమార్ మాట్లాడుతూ జీవో నెంబర్–36 ప్రకారం వేతనాలు పెంచాలని కేటగిరీ నిర్ణయంలో పొరపాట్లు సరిదిద్దాలని డిమాండ్ చేశారు. షరతులు లేకుండా ఇంజినీరింగ్, కార్మికులకు సంక్షేమ పథకాలు వర్తింప చేయాలన్నారు. వయోపరిమితి 62ఏళ్లకు పెంచాలని, గ్రాట్యూటీ చెల్లించాలని కోరారు. చట్టబద్ధమైన సెలవులు ఇవ్వాలని, 20 రోజులుగా ఆందోళన చేస్తున్నా.. కూటమి ప్రభుత్వానికి చీమకుట్టినట్‌లైనా లేదన్నారు. ఏపీ ఎన్‌జీవో జెఏసీ కన్వీనర్ ఎస్వీ.రమణ, అధ్యక్షుడు హరిప్రసాద్ వీరికి సంఘీభావం తెలిపారు. పీవీరమణ, లక్ష్మీదేవి, ప్రసాద్, ఓబయ్య పాల్గొన్నారు.

మాటలు వద్దు.. పరిహారం ఇవ్వండి


గిరిజన కుటుంబాలతో మాట్లాడుతున్న సిహెచ్ చంద్రశేఖర్

రైల్వేకోడూరు అర్బన్ : పుల్లంపేట మండలం రెడ్డిపల్లి చెరువుకట్ట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన గిరిజన కూలీలకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించకుండా మాటలు చెబితే సరిపోతుందా అని జిల్లా సీఐటీయూ అధ్యక్షుడు సిహెచ్.చంద్రశేఖర్ ప్రశ్నించారు. మృతి చెందిన కూలీల కుటుంబాలను బుధవారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతిచెంది నాలుగు రోజులైనప్పటికీ ఇంతవరకు రాష్ట్ర ప్రభుత్వం ఎక్స్ గ్రేషియా ప్రకటించలేదన్నారు. గిరిజనులు, యానాదుల పట్ల వివక్షత చూపుతున్నారని విమర్శించారు. ఈ నెల 21న కోడూరు ఎంఆర్‌ఓ కార్యాలయం వద్ద నిరసన చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఇన్‌చార్జ్ మంత్రి జనార్ధన్ రెడ్డి, నియోజకవర్గ కూటమి నాయకులు పరామర్శించినప్పటికీ ఏ ఒక్కరూ గిరిజనులను ఆదుకునే ప్రయత్నం చేయలేదన్నారు. మృతి చెందిన కుటుంబాలకు తక్షణమే రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా, గాయపడిన వారికి రూ. 10 లక్షలు ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దాత సాయంతో ఠాణాకు మెరుగులు


గిరీష్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎస్ఐ రవిప్రకాష్ రెడ్డి

పెనగలూరు : పెనగలూరు పోలీస్ స్టేషన్ మరమ్మతులకు కొత్తపల్లి గ్రామానికి చెందిన తలమంచి గిరీష్‌రెడ్డి రూ.10 లక్షలు వితరణచేశారు. 988లో నిర్మించిన పెనగలూరు పోలీసు స్టేషన్ భవనాలకు ఇప్పటివరకూ ఎలాంటి మరమ్మతులు చేయలేదు. ఎస్ఐకు కేటాయించిన గది కూడా శిథిలావస్థకు చేరుకుంది. 37 సంవత్సరాల స్టేషన్‌ను ఎస్ఐ రవిప్రకాష్‌రెడ్డి చొరవ తీసుకుని రీ మోడలింగ్ చేయిస్తున్నారు. దాతల సహకారం కోరడంతో గిరీష్‌రెడ్డి ముందుకు వచ్చి రూ.10 లక్షలు అందజేశారు. దీంతో నూతన విద్యుత్తు లైన్లు, దీపాలు వేయించారు. మరుగుదొడ్డి గదికి మరమ్మతులు చేయించారు. కంప్యూటర్ రూమ్‌లో టేబుల్, స్టేషన్ గది ఎదుట టైల్స్, ఉత్తరం వైపున సిమెంట్ ఫ్లోరింగ్, రిజిష్టర్లు పెట్టుకునేందుకు షెల్ఫ్ ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా గిరీష్‌రెడ్డిని పోలీసులు బుధవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సిబ్బంది, కొత్తపల్లి యూత్ సభ్యులు పాల్గొన్నారు.

వాహన డ్రైవర్ల మధ్య ఘర్షణ


గాయపడిన వాహన డ్రైవర్ శ్రీనివాసులు

మదనపల్లె రూరల్ : తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్ల మధ్య జరిగిన ఘర్షణలో వాహనం అద్దాలు ధ్వంసమైన ఘటన బుధవారం సాయంత్రం జరిగింది. ములకలచెరువు మండలం బురకాయలకోటకు చెందిన శ్రీనివాసులు(37) తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం పురిటి బిడ్డ, తల్లిని తరిగొండలో దింపేసి వాహనాన్ని జిల్లా ఆస్పత్రిలో నిలిపేందుకు రాగా, క్యాంటీన్ సమీపంలో మరో డ్రైవర్ పృథ్వీరాజ్ ఉన్నాడు. శ్రీనివాసులు వాహనం తన పక్కగా వెళ్లనివ్వడంతో మద్యం మత్తులో ఉన్న పృథ్వీరాజ్, శ్రీనివాసులును దూషించాడు. వాహనంలోకి ప్రవేశించి వాహనం పార్కింగ్ చేసే ప్రదేశం వరకూ వెళ్లాడు. అక్కడ శ్రీనివాసులును వాహనంలో నుంచి కిందకు దించి రాయితో విచక్షణా రహితంగా కొట్టాడు. ఆస్పత్రికి వెళ్లిన శ్రీనివాసులు చికిత్స పొందుతుండగా, పృథ్వీరాజ్ మరోసారి కత్తెర తీసుకుని పొడిచేందుకు ప్రయత్నించాడు. అక్కడ ఉన్న సిబ్బంది అప్రమత్తమై అతడిని బలవంతంగా ఆస్పత్రి బయటకు పంపించారు. అక్కడి నుంచి వెళ్లిన పృథ్వీరాజ్, శ్రీనివాసులుపై ద్వేషంతో అతడు నడుపుతున్న వాహనం అద్దాలను పగలగొట్టాడు. ఈ ఘర్షణలో పృథ్వీరాజ్ సైతం గాయపడ్డాడు. ఘటనపై బాధితుడు శ్రీనివాసులు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశాడు. పోలీసులు ఆస్పత్రికి చేరుకుని విచారించారు.

సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం



ధర్నా నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు

బద్వేలు అర్బన్ : మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కె.నాగేంద్రబాబు అన్నారు. మున్సిపల్ ఉద్యోగ, కార్మికులు బుధవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తయినప్పటికీ ఇంజినీరింగ్ కార్మికుల నైపుణ్యం ఆధారంగా వేతనాలు చెల్లించలేదన్నారు. గతంలో సమ్మె నేపథ్యంలో ప్రభుత్వం అంగీకరించిన ఒప్పందాలకు జీవోలు జారీ చేయకపోవడం సరికాదన్నారు. ఆప్కాస్ సంస్థను సైతం రద్దు చేసి ప్రైవేట్ ఏజెన్సీలను ప్రోత్సహించాలనుకోవడం దారుణమన్నారు. 60 సంవత్సరాలు నిండిన కార్మికులను బలవంతంగా పదవీ విరమణ చేయించడం మంచిది కాదన్నారు. బద్వేల్ మున్సిపాలిటీలో చనిపోయిన కార్మికుల కుటుంబాలకు ఎక్స్ గ్రేషియా, మట్టి ఖర్చు డబ్బులు చెల్లించకపోవడం బాధాకరమని అన్నారు. సమస్య పరిష్కరించని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలకు చేపడతామని హెచ్చరించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ నాయకులు నాగార్జున, వెంకటరమణ, డి.హరి, డి.నాగేంద్రబాబు, దేవమ్మ, చంద్రశేఖర్, నాగరాజు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఐచర్ వాహనం ఢీకొని ఒకరికి గాయాలు


గాయపడిన సయ్యద్‌సాహెబ్

మదనపల్లె రూరల్ : ఐచర్ వాహనం ఢీకొని ఓ వ్యక్తి గాయపడిన సంఘటన బుధవారం సాయంత్రం మదనపల్లె మండలంలో జరిగింది. మండలంలోని తురకపల్లెకు చెందిన సయ్యద్‌సాహెబ్(54) నమాజుకు వెళ్లేందుకు ద్విచక్ర వాహనంలో వెళ్తున్నారు. మార్గ మధ్యంలో పీలేరు నుంచి బెంగళూరు వెళుతున్న ఐచర్ వాహనం ఢీకొంది. ప్రమాదంలో సయ్యద్‌సాబ్ తీవ్రంగా గాయపడగా మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. బాధితుడి కుమారుడు ఖాదర్‌సాహెబ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు సీఐ కళావెంకటరమణ తెలిపారు.

స్కూటర్లు ఢీకొని..

రాయచోటి టౌన్ : రెండు స్కూటర్లు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. ట్రాఫిక్ సీఐ కథనం మేరకు..పట్టణానికి చెందిన ఖాదర్ బాషా రాయచోటి నుంచి రాయవరం వెళ్లుతున్నాడు. అదే సమయంలో రెడ్డెయ్య రాజు టీవీఎస్‌పై రాయచోటికి వస్తున్నాడు. రాయచోటి – సుండుపల్లె రోడ్డులోని గంగోత్రి(గురుకుల పాఠశాల సమీపంలో)గంగోత్రి వాటర్ ప్లాంట్ వద్దకు రాగానే రెండు స్కూటర్లు ఢీకొన్నాయి. ఇద్దరికీ తీవ్ర గాయాలవడంతో కడప ఆస్పత్రికి పంపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సోషల్ మీడియాలో పోస్టులు పెట్టాడని వైఎస్సార్‌సీపీ నేత అరెస్టు

బెయిల్ మంజూరు చేసిన గుంటూరు సీఐడీ న్యాయస్థానం

సాక్షి టాస్క్‌ఫోర్స్ : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, ఆయన తల్లి భువనేశ్వరిలపై సోషల్ మీడియాలో పోస్టులు పెట్టాడని పులివెందుల నియోజకవర్గంలోని చక్రాయపేట సర్పంచ్ అర్షద్ అయూబ్‌బాషాను తిరుపతిలో సీఐడీ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. బుధవారం గుంటూరు సీఐడీ కోర్టులో హాజరుపరచగా.. న్యాయమూర్తి వాదనలు విన్న తర్వాత నిందితుడికి బెయిల్ మంజూరు చేశారు. వివరాలిలా ఉన్నాయి. అర్షద్ అయూబ్ బాషా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఆయన సతీమణి భువనేశ్వరి, తనయుడు మంత్రి లోకేష్‌పై అసభ్యంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టి వారి పరువుకు భంగం కలిగిస్తున్నాడని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాటి అమరనాథరెడ్డి డీజీపీకి 05-12-2024న ఫిర్యాదు చేశాడు. దీంతో తిరుపతిలో సీఐడీ పోలీసులు కేసు నమోదు చేశారు. అర్షద్ అయూబ్ తన సొంత పనులపై మంగళవారం తిరుపతి వెళ్లిన విషయం తెలుసుకున్న సీఐడీ పోలీసులు ఆయన్ను అక్కడే అరెస్టు చేసి గుంటూరు సీఐడీ న్యాయస్థానంలో హాజరు పరిచారు. న్యాయమూర్తి నిందితుడికి బెయిల్ మంజూరు చేశారు.

భార్య చేతిలో భర్త హతం

కడప అర్బన్ : రోజూ మద్యం తాగి అనుమానంతో గొడవపడడంతో ఆగ్రహంతో ఊగిపోయిన భార్య గోడకేసి తోసింది.. బలమైన దెబ్బ తగలడంతో భర్త అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన కడపలో బుధవారం చోటుచేసుకుంది. కడప వన్‌టౌన్ పోలీసుల కథనం మేరకు..కడప నగరంలోని ఎర్రముక్కపల్లి బాల వికాస్ హైస్కూల్ వెనుక వీధిలో దేరంగుల సుబ్బరాయుడు(32) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతడికి భార్య హరిత, కుమార్తె, కుమారుడు వున్నారు. రోజూ మాదిరిగానే మంగళవారం రాత్రి 10:30 గంటల సమయంలో సుబ్బరాయుడు మద్యం తాగి భార్య హరితతో గొడవపడ్డాడు. అదే సమయంలో హరిత అన్న హరికృష్ణ వచ్చి ఎందుకు రోజూ మద్యం తాగి గొడవపడతావని నిలదీశాడు. వాగ్వాదం పెరగడంతో తన భర్తను హరిత గోడకేసి తోసింది. గోడ మోటు బలంగా తగలడంతో సుబ్బరాయుడు అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ విషయాన్ని స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వీఆర్‌ఓ ఫిర్యాదు మేరకు మృతుడి భార్య హరిత, బావమరిది హరికృష్ణలపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.